

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన వివేకానంద కేంద్రం ప్రతినిధులు

భగవద్గీత శ్లోకాల పఠనంపై పోటీలు

నల్లకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠంలో ధారణా శిబిరంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠనంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న చిన్నారులు భక్తితో శ్రావ్యంగా శ్లోకాలు పఠించి అందరి మెప్పు పొందారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్రం బాగ్‌లింగంపల్లి ఇన్‌చార్జి రంగాచార్యులు, సదానంద్‌ఖాకడే, రామలింగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.హరినాథ్‌రెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు ప్రదానం

గోల్నాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా గ్లోబల్ పీస్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని సామాజికవేత్త బోర్లకుంట దీపక్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ సీ.హెచ్.మధుకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికా గ్లోబల్ పీస్ కమిటీ అంతర్జాతీయ గ్లోబల్ పీస్ అవార్డును దీపక్ కుమార్‌కు ప్రదానం చేశారు. అనంతరం దీపక్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ సంబంధాలపై అధ్యయనం చేసి ఐక్యరాజ్యసమితికి నివేదిక సమర్పించిన సందర్భంగా ఈ అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు.



దీపక్‌కుమార్‌కు అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రొ.మధుకృష్ణన్



ట్రోఫీతో బద్రుక కళాశాల జట్టు

ఓయూ నెట్‌బాల్ విజేత బద్రుక

బర్కత్‌పుర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అవంతి డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీలలో ఓయూ నెట్‌బాల్ విజేతగా బద్రుక కళాశాల జట్టు నిలిచింది. పురుషుల నెట్‌బాల్ టైటిల్‌ను ఈ జట్టు కైవసం చేసుకుంది. అవంతి డిగ్రీ కాలేజీ జట్టు అంబేడ్కర్ కళాశాల జట్లు రెండు, మూడో స్థానంలో నిలిచాయి. బెస్ట్ ఆల్ రౌండర్‌గా మారుతి, బెస్ట్ షూటర్‌గా షోలేక్, డిఫెండర్‌గా శ్రీనికేతన్‌చారిలు బహుమతులను అందుకున్నారు. ఓయూ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఓయూ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి ప్రొఫెసర్ దీప్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ మనోజ్‌కుమార్, అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారుడు బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుశీల్‌కుమార్, సుధాకర్

29న బ్రాహ్మణ మహా సమ్మేళనం

రాంనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల ఐక్యత, అభివృద్ధి, పూర్వవైభవం కోసం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుశీల్‌కుమార్, వింజమూరి సుధాకర్‌లు పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేటలోని సీఈకాలనీ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణుల అభివృద్ధి, పూర్వవైభవం కోసం ఈనెల 29న రవీంద్రభారతిలో మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, పి.వి.రాంచందర్‌రావు, విష్ణు, శ్రీకాంత్, సీతారామయ్య, వైద్యనాథ్, వేదాంతం, పవన్‌కుమార్, విద్యావతి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిక్కడపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ పిలుపునిచ్చారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతీనెలా మొదటివారం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించుకుందామని వివరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ముఠా నరేశ్, ఎస్‌టి ప్రేమ్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి

ముషీరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను ముషీరాబాద్‌లో బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆకుల అరుణ్ కుమార్, శివముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, శ్రీనివాస్, బిక్షపతి యాదవ్, సత్యనారాయణ బాబు, శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్య షష్టిపూజలు

చిక్కడపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో షష్టి పూజల కార్యక్రమం ఆదివారం ముగిసింది. సుబ్రహ్మణ్యషష్టి పర్వదినం సందర్భంగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, సాయంత్రం 5 నుంచి 8 వరకు స్వర్ణపుష్పార్చనలు ఈవో లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, కాంగ్రెస్ యువజన ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి భారీ బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీని గౌరీ సతీష్, అరవింద్‌కుమార్ యాదవ్‌లు ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ప్రారంభమై గోల్కొండ క్రాస్‌రోడ్ మీదుగా గాంధీనగర్ ఆంధ్రా కేఫ్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రెండు లక్షల పంట రుణాలను మాఫీ చేసిందని, దాదాపు 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఏ అండ్ బీ బ్లాక్ అధ్యక్షుడు వీడీ కృష్ణ, అంజియాదవ్, ఐఎన్‌టీయూసీ నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సునీతారావు తదితరులు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

రాంనగర్: మహిళలు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయిన సందర్భంగా సునీతారావు ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బస్సులో మహిళా ప్రయాణికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, నాయకురాలు కవిత, ఆర్. లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజల మద్దతు

సీఎం ప్రజాపాలనకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని నెహ్రూనగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది పాలన పూర్తయిన సందర్భంగా పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాసాని ఆనంద్, శ్యామ్‌యాదవ్, వాజీద్ హుస్సేన్, జావేద్, అజయ్, మీరాబాయ్, రాజు, జబ్బార్, నరేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

ముషీరాబాద్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



ఇందిరాపార్కు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న అరవింద్, గౌరీసతీష్



ముషీరాబాద్‌లో ర్యాలీని నిర్వహిస్తున్న పెండం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు



ఆలయ పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్లు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

నల్లకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవితంలో నిత్యం ప్రతీఒక్కరు ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఉదయం నల్లకుంట డివిజన్ టీఆర్‌టీకాలనీలో దుర్గామాత ఆలయ పునఃనిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్లు యాకర.అమృత, బి.పద్మావెంకటరెడ్డిలతో కలిసి భూమిపూజ చేశారు. టీఆర్‌టీ కాలనీలో దుర్గామాత ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే, కార్పొరేటర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, శ్రీదుర్గామాత ఆలయ అధ్యక్షుడు నల్లా నరేష్‌కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఎక్కుతూ జారిపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర రాజేంద్రనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న కనకదుర్గ(54) మూడు నెలల క్రితం భర్త జనార్దన్‌రావుతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లడానికి కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. అయినా కాలుకు నొప్పి తగ్గకపోగా సెప్టిక్ కావడంతో కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు కాచిగూడ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు సుభాష్ ఆదివారం తెలిపారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేయాలి

బర్కత్‌పుర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో తాగునీటి పైప్‌లైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని నింబోలిఅడ్డ మెయిన్‌రోడ్, అహ్మద్‌బాగ్ బస్తీలో తాగునీటి పైప్‌లైన్ వాల్ పాడైపోయి పడుతున్న ఇబ్బందులను స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆమె ఆ ప్రాంతానికి వెళ్లి జలమండలి అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ వాల్ మరమ్మతు పనులు పూర్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత కన్నె రమేష్‌యాదవ్, స్థానిక నాయకులు ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

విజయవంతంగా కొనసాగుతున్న ప్రజాపాలన

చిక్కడపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన విజయవంతంగా కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అన్నారు. డివిజన్‌కు చెందిన సీఎంఆర్ఎఫ్ పథకం లబ్ధిదారు ఈడిగ కళావతికి మంజూరైన 54 వేల రూపాయల చెక్‌ను ఆదివారం ఆయన లబ్ధిదారు కుమారుడు శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రికార్డుస్థాయిలో 840 కోట్ల రూపాయలు సీఎంఆర్ఎఫ్ పథకం కింద లబ్ధిదారులకు అందజేసిందని వివరించారు. ప్రస్తుతం సీఎంఆర్ఎఫ్ పథకం కింద దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ

బర్కత్‌పుర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. అయ్యప్పస్వామి మహాపడి పూజ నేత్రపర్వంగా సాగింది. అయ్యప్పస్వామి మాలధారుల భజనలతో ఆ ప్రాంగణమంతా హోరెత్తింది. రంగురంగు పూలతో 18 మెట్లను సుందరంగా అలంకరించి పడి వెలిగించారు. హరిహర సుతునికి అభిషేకం నిర్వహించారు. ఆత్రేయ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. రమేష్ ఆధ్వర్యంలో భజన గీతాలను ఆలపించారు. కిషన్‌రెడ్డి కుటుంబసభ్యులు 24 ఏళ్లుగా యేటా అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహిస్తున్నారు. అయ్యప్పస్వామి మహాపల్లకీ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భాగంగా అభిషేకం నిర్వహించారు. కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పల్లకీని మోస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ తదితరులు

శారదనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

నల్లకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శారదనగర్‌లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని శారదనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశంలో పలు సమస్యలపై ప్రజలు కార్పొరేటర్‌కు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె మాట్లాడుతూ మంచినీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పార్కులు ఇతరత్రా వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

ముషీరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని సిద్దిక్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా దీన్‌దయాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పార్టీ నేతలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, నాయకులు రహీం, మున్వర్‌చాంద్, చాంద్‌పాషా, ఆర్ శ్రీనివాస్, ప్రవీణ్, సాయి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

సైబర్ నేరాల డబ్బు రికవరీలో..

దేశంలోనే తెలంగాణ టాప్

- ఈ ఏడాదిలో రూ. 140 కోట్లు రికవరీ చేసి.. బాధితులకు అందజేత : డీజీపీ శిఖాగోయల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను చేదించి, డబ్బు రికవరీ చేయడంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే టాప్‌లో ఉందని డీజీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు. హైటెక్స్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం జరిగిన టెడెక్స్ 10వ ఎడిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 170 రకాల మోసాలతో సైబర్ క్రిమినల్స్ మీ డబ్బును దోచుకుంటారని తెలిపారు. సుమారు 1200 మంది హాజరైన ఈ కార్యక్రమానికి ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఎంతో మంది రక్షించిన ట్యాంక్‌బండ్ శివ, సినీ దర్శకుడు నిర్మాత నాగ్ అశ్విన్, రవి ప్రభు, డాక్టర్ ప్రహ్లాద్ రామారావు ప్రఖ్యాత ఏరోస్పేస్ శాస్త్రవేత్త, ఎన్డీటీవీ ఎడిటర్ ఉమా సుధీర్, వహరేవాహ్ వెబ్‌సైట్ చెఫ్ సంజయ్ తుమ్మా, రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న శిఖాగోయల్

గంగపుత్రులు ఐక్యంగా ఉండాలి

ముషీరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన డిమాండ్లు సాధించుకోవచ్చని మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో జరిగిన సమావేశంలో గంగపుత్ర సంఘం 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ సీఐ రాంబాబు మాట్లాడుతూ... ప్రజాసంఘాలు సామాజిక బాధ్యతతో ప్రజలకు సేవలు అందిస్తూ అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అతిథులను బిజ్జి కనకేష్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర ఫెడరేషన్ జిల్లా చైర్మన్ పద్మా, ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు శివరత్నం, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు శివాజీ, మహాత్మానగర్ సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ


కవాడిగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్‌లోని విజయగణపతి, ఓంకారేశ్వర స్వామి , కోదండరామస్వామి దేవాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ధ్వజస్తంభం, సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయ, నాగదేవత విగ్రహాలు, నవగ్రహ శివలింగ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వేదపండితులు అర్చనలు, అభిషేకాలు, యాగాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ ఎం అంజన్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చికోటి శ్రీనివాసులు, ఎంవి కృష్ణుడు, ఎ ఆనంద్, భువనగిరి నవీన్, కిరణ్, వెంకటేష్, వివేక్, పవన్‌కుమార్, కె నాగేశ్వర్‌రావు బి వెంకట్‌రెడ్డి, సిహెచ్ హనుమంతు కె నారాయణ, బీజేపీ నేతలు మహేందర్‌బాబు, భువనగిరి చంద్రశేఖర్, వెంకటస్వామి, బీఆర్ఎస్ నేతలు శ్యామ్‌యాదవ్, ఎన్‌డి సాయికృష్ణ, రవియాదవ్, డాక్టర్ శ్రీహరి, దుర్గాస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, ఆలయ కమిటీసభ్యులు

బిజ్జి శత్రుకు డాక్టరేట్ ప్రదానం

ముషీరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు బిజ్జి శత్రుకు పోలీస్ స్పిరిట్ క్రిష్టియన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ బి.ఆనంద్‌కుమార్ బిజ్జి శత్రుకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజ్జి శత్రు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్‌ను అందజేశామని తెలిపారు. అనంతరం బిజ్జి శత్రు మాట్లాడుతూ... కరోనా కాలంలో పేద ప్రజలను నివసించే ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు. తనకు మరింత బాధ్యత పెరిగిందని భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. వర్సిటీ ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రేమానంద, మాధవిరావు పాల్గొన్నారు.




బిజ్జి శత్రుకు డాక్టరేట్ ప్రదానం చేసిన డాక్టర్ ఆనంద్‌కుమార్

ఆవిష్కరణకు వేళాయె..



సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభ ఏర్పాట్లను చేస్తున్న కార్మికులు

సంబురం.. అబ్బురం



ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సెక్రటేరియట్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహించారు. వీటిని తిలకిస్తున్న ఆహూతులు



ట్రాఫిక్ జంఝాటం

ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్‌షో ముగిసిన తర్వాత సెక్రటేరియట్ మార్గంలో ట్రాఫిక్ జామ్